




ప్రజాజ్యోతి
ఖమ్మం
ఆదివారం 17-3-2024 పేజీలు : 6

## ఎన్నికల కోడ్‌ను పక్కాగా

# అమలు చేయాలి

### రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్

**ఖమ్మం, మార్చి 16 ప్రజాజ్యోతి**

భారత ఎన్నికల సంఘం సాధారణ లోకసభ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో వెంటనే ఎన్నికల కోడ్ అమలులోకి వస్తుందని, దీనిని పక్కాగా అమలు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్, డిజిపి రవి గుప్తా, ఇతర రాష్ట్ర స్థాయి ఉన్నత స్థాయి అధికారులతో కలిసి లోకసభ కు జరగబోయే సాధారణ ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు . ఈ సమావేశానికి నూతన కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్, పోలీస్ కమీషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్లు బి. సత్యప్రసాద్, డి. మధుసూదన్ నాయక్, నగరపాలక సంస్థ కమీషనర్ ఆదర్శ్ సురభి, శిక్షణా కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజ్, ట్రెయినీ ఐపీఎస్ మౌనిక లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ మాట్లాడుతూ, భారత ఎన్నికల కమిషన్ సాధారణ లోకసభ ఎన్నికల 2024 కు షెడ్యూల్ విడుదల చేసిందని, దేశ వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చిందని అన్నారు . దేశంలో 7 దశలలో పార్లమెంట్ సాధారణ ఎన్నికలు జరుగుతాయని, మన తెలంగాణలో పోలింగ్ నాలగవ దశలో మే 13 వ తారీఖు జరుగుతుందని, కౌంటింగ్ ప్రక్రియ జూన్ 4న ఉంటుందని అన్నారు. ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో తక్షణమే ఎన్నికల ప్రవర్తన నియమావళి (ఎన్నికల కోడ్) అమలులోకి వస్తుందని, 24 గంటల వ్యవధిలో ప్రతి ప్రభుత్వ భవనాలలో వివిధ రాజకీయ పార్టీలకు, నాయకులకు సంబంధించిన హోర్డింగులు, నాయకుల ఫోటోలు , వాల్ రైటింగ్స్ తొలగించాలని, 48 గంటల వ్యవధిలో పబ్లిక్ ప్రాపర్టీస్ వద్ద హోర్డింగులు, ఫ్లెక్సీలు ఫోటోలు తొలగించాలని, ప్రైవేట్ స్థలాల్లో ఉన్న హోర్డింగులు, ఫ్లెక్సీలు, ఫోటోలను 72 గంటల్లో తొలగించాలని ఆయన అధికారులకు ఆదేశించారు. రాష్ట్రంలో ఉన్న వివిధ ప్రభుత్వ శాఖల వెబ్ సైట్, జిల్లా వెబ్ సైట్ లలో మంత్రుల ఫోటోలు, ముఖ్యమంత్రి ఫోటో లను తొలగించాలని అన్నారు. రాజకీయ పార్టీలు, వివిధ వర్గాలకు చెందిన ప్రజలకు ర్యాలీలు, సభల నిర్వహణకు...

మిగతా 2లో...

## పాలేరు నియోజకవర్గ అభివృద్ధి

# లక్ష్యంగా పనిచేస్తా

### మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



ఖమ్మం, మార్చి 16 ప్రజా జ్యోతి. పాలేరు నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి చర్యలు చేపట్టనున్నట్లు రాష్ట్ర రెవిన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖామాత్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం మంత్రి పాలేరు నియోజకవర్గంలో పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంఖుస్థాపలు చేశారు. కూసుమంచి మండల కేంద్రంలో రూ. 28.80 లక్షలతో చేపట్టే (6) అంతర్గత సిసి రోడ్ల నిర్మాణ పనులకు, జీళ్ళచెరువు గ్రామంలో రూ. 57.80 లక్షలతో చేపట్టే (8) అంతర్గత సిసి రోడ్ల నిర్మాణ పనులకు, నేలకొండపల్లి మండలం చెన్నారం గ్రామం వద్ద రూ 20 కోట్ల వ్యయంతో చేపట్టే రాజేశ్వరపురం- చెన్నారం-పోలారం- జక్కేపల్లి ఆర్ అండ్ బి రహదారి విస్తరణ, పటిష్ట పరుచు పనులకు, చెరువుమాధారం గ్రామంలో రూ. 20 లక్షలతో చేపట్టే (4) అంతర్గత సిసి రోడ్ల నిర్మాణ పనులకు, ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలోని 1వ డివిజన్ కైకొండాయగూడెం వద్ద రూ. 1 కోటి వ్యయంతో చేపట్టే సిసి రోడ్, సైడ్ కాల్వల నిర్మాణ పనులకు శంఖుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పనులు ప్రారంభించిన అంతర్గత రోడ్ల నిర్మాణాలు రాబోయే 2 నెలల్లో, వేసవిలోగా పూర్తి చేయాలన్నారు. అభయహస్తం ద్వారా ఇచ్చిన 6 గ్యారంటీల్లో ఇప్పటికే 5 గ్యారంటీలు అమలుచేశామన్నారు. ఎన్నికల కోడ్ వల్ల 6వ గ్యారంటీ అమలు కాలేదని, కోడ్ తర్వాత ఆ హామీని పేదవాడి ఇంటికి చేరుస్తామని అన్నారు. ప్రభుత్వం ఏర్పడ్డ 48 గంటల్లోనే 2 హామీలు అమలు చేసినట్లు ఆయన అన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించినట్లు, గడచిన 98 రోజుల్లో 29 కోట్ల మంది ఆడబిడ్డలు ఉచిత ప్రయాణాలు చేసినట్లు ఆయన అన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా పేదవారికి రూ. 10 లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తున్నామన్నారు. రూ. 500 లకే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నట్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. తెల్ల రేషన్ కార్డులు అర్హులైన ప్రతి ఒక్కరికి అందజేస్తామన్నారు. ఇందిరమ్మ ఇండ్లను మొదటి విడతగా స్థలం ఉన్నవారికి రూ. 5 లక్షల చొప్పున అందజేయనున్నట్లు, రెండో విడతలో స్థలంతో పాటు, ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షలు ఇవ్వనున్నట్లు ఆయన అన్నారు. ఇంకనూ రావాల్సిన వారందరికీ పెన్షన్లు అందజేస్తామన్నారు. ప్రభుత్వం ఏర్పడ్డ 75 రోజుల్లోనే 31 వేల ఉద్యోగ నియామకాలు చేసినట్లు ఆయన తెలిపారు. టీఎస్ పిఎస్సి ని ప్రక్షాళన చేసి, గ్రూప్-1 నుండి గ్రూప్-4 వరకు వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చినట్లు ఆయన అన్నారు. మెగా డిఎస్సి ప్రకటించి, 11062 ఉద్యోగ నియామకాలు చేపట్టనున్నట్లు మంత్రి అన్నారు. రాబోయే సంవత్సర కాలంలో పాలేరు నియోజకవర్గంలో ప్రతి గ్రామం, ప్రతి కాలనీలో ఒక్క మట్టి రోడ్డు లేకుండా అన్ని సిసి రోడ్ల నిర్మాణం చేయనున్నట్లు ఆయన తెలిపారు. త్రాగునీరు, సాగునీరు సమస్యలను శాశ్వతంగా పరిష్కరించనున్నట్లు, విద్య, వైద్య రంగాల్లో అభివృద్ధి పర్చనున్నట్లు ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం నగరపాలక సంస్థ కమీషనర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, ఆర్ అండ్ బి ఎస్ఇ శ్యామ్ ప్రసాద్, పీఆర్ ఎస్ఇ చంద్రమౌళి, జిల్లా ఉపాధికల్పన అధికారి కె. శ్రీరామ్, మిషన్ భగీరథ ఇఇ లు పుష్పలత, వాణిశ్రీ, పబ్లిక్ హెల్త్ ఇఇ రంజిత్, మునిసిపల్ ఇఇ కృష్ణ లాల్, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీలు ఏర్పాటు చేసి

# కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలి

### జిల్లా కలెక్టర్ విపి గౌతమ్

**ఖమ్మం ప్రతినిధి మార్చి 16 ప్రజాజ్యోతి**

ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీలు ఏర్పాటుచేసి, కనీస మౌళిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ గౌతమ్ తెలిపారు. శనివారం నూతన కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎంపిడివోలు, ఎంపీవోలు, ఏపీఎంలతో మహిళాశక్తి కార్యక్రమంపై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాల నిర్వహణ బాధ్యతలను స్వశక్తి మహిళా సంఘాలకు అప్పగిస్తున్నట్లు తెలిపారు. ఈమేరకు ప్రతీ పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు ఏర్పాటు చేయాలని, కమిటీకి మహిళా సంఘం నాయకురాలు అధ్యక్షురాలిగా, హెచ్ఎం మెంబర్ కన్వీనర్ గా ఉంటారని తెలిపారు. గ్రామంలో రెండు, మూడు సంఘాలు ఉంటే పాఠశాలకు సమీపంలోని సంఘానికి తొలుత అవకాశం ఇవ్వాలని సూచించారు. ఆ తర్వాత రెండేళ్లకు కొనసాగే కమిటీలో విద్యార్థుల తల్లులను సభ్యులుగా ఎంపిక చేయాలని ఆయన అన్నారు. కమిటీ



పేరిట బ్యాంక్ ఖాతా తెరవాలని ఆయన సూచించారు. పాఠశాలలో విద్యార్థులకు కావలసిన వసతులు ఏం కావాలో నివేదికను రూపొందించుకొని, వాటిని సమకూర్చుకోవాలన్నారు. తరగతి గదిలో సరిపోను వెలుతురు వుండేలా ఎల్ఇడి లైట్లు, మంచి గాలి వచ్చే విధంగా కంపెనీ ఫ్యాన్లు అమర్చాలన్నారు. వేసవి సెలవులు తర్వాత విద్యార్థులు మళ్ళీ తిరిగి స్కూల్ కు వచ్చే సమయానికి మొత్తం మార్పు రావాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల యూనిఫామ్ కుట్టే బాధ్యతను సైతం స్వశక్తి మహిళా సంఘాలకు కేటాయిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా యూనిఫాం కుట్టే సామర్థ్యం కలిగిన మహిళా సంఘాలను గుర్తించి ఆర్డర్ ఇవ్వాలని సూచించారు. ఇక తాగునీటి సౌకర్యం, తరగతి గదుల మరమ్మతులు, టాయిలెట్లను వినియోగంలోకి తీసుకురావడం, బాలికల కోసం అదనపు టాయిలెట్ల నిర్మాణం, విద్యుత్ వసతుల కల్పన బాధ్యతలను జూన్ 10వ తేదీలోగా అమ్మ పాఠశాల కమిటీల ద్వారా చేపట్టాల్సి ఉంటుందని తెలిపారు.

# మిర్చి మార్కెట్ కార్మికులు కూలీలకు వాటర్ కూలర్లు ఏర్పాటు



ఖమ్మం కార్పొరేషన్ మార్చి 16 (ప్రజాజ్యోతి)
లయన్స్ క్లబ్ ఆఫ్ ఖమ్మం వారి ఆధ్వర్యంలో ఈ రోజు లయన్స్ క్లబ్ ఆఫ్ ఖమ్మం సభ్యులు లయన్ కలవకుంట్ల గోపాల్ రావు, లయన్ కుమ్మరకుంట్ల శ్రీనివాసరావు దాతృత్వం తో, ఖమ్మం మిర్చి మార్కెట్ యార్డ్ లో 95 వేల రూపాయల విలువ కలిగిన రెండు వాటర్ కూలర్ లను, రైతులు మరియు కార్మికుల సౌకర్యార్థం డైరెక్టర్ ఆఫ్ మార్కెటింగ్ తెలంగాణ శ్రీమతి లక్ష్మీబాయి రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి శ్రీ ప్రవీణ్ కుమార్ రెడ్డి తో పాటు లయన్స్ క్లబ్ ఆఫ్ ఖమ్మం అధ్యక్ష కార్యదర్శి కోశాదికారులు లయన్ తల్లపురెడ్డి కృష్ణా రెడ్డి, వేముల హనుమంత రావు, గడిపూడి జనార్ధన్ రావు, పాయల నాగేశ్వరరావు, చిన్ని కృష్ణారావు, అత్తలూరి గోవర్ధన్ రావు, కొంకిమళ్ళ విశ్వేశ్వర రావు, బిజ్జాల ఈశ్వర్ రావు, మేక దుర్గా నాగేశ్వర రావు, అబ్దుల్ అలీం, వి.కోటేశ్వర రావు, ఏటుకూరి శ్రీనివాస రావు, వి వెంకయ్య, అవోపా కృష్ణ మూర్తి,ఐత్తుల బసవపున్నయ్య , మాటేటి రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు . లయన్స్ క్లబ్ ఆఫ్ ఖమ్మం వారు మార్కెట్ యార్డ్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని రైతులకు కార్మికులకు గుమస్తా లకు చల్లటి త్రాగుడు నీటిని అందించడానికి ప్రతీ సంవత్సరం వాటర్ కూలర్ లను ఏర్పాటు చేయడం ఆనందించ తగిన విషయం అని శ్రీమతి లక్ష్మీబాయి పేర్కొన్నారు.

## బాలరాజు సతీమణి మృతదేహానికి కాంగ్రెస్ నాయకులూ ఘన నివాళి

బోనకల్, మార్చి 16,(ప్రజా జ్యోతి:



మండల పరిధిలోని చిన్నబీరవల్లి గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు గత్తం బాలరాజు సతీమణి శనివారం మరణించడం జరిగింది. బాలరాజు సతీమణి మృతదేహాన్ని పిసిసి సభ్యులు పైడిపల్లి కిషోర్ కుమార్, జడ్పిటిసి మోదుగుసుధీర్ బాబు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు గాలి దుర్గారావు లు సందర్శించి ఘన నివాళులు అర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## పిండిప్రోలు సంత బహిరంగ వేలం నిర్వహించాలి

గుట్టు చప్పుడు కాకుండా వారపు సంత వేలం వేసే ప్రయత్నం



తిరుమలాయపాలెం మార్చి 16 (ప్రజాజ్యోతి) :
ఎలాంటి సమాచారం లేకుండా తిరుమలాయపాలెం మండలం లో ఎంతో పేరు గాయించిన పిండిప్రోలు సంతను వ్యాపారులు సిండికేట్ గా ఏర్పడి అతి తక్కువ ధరకు వేలం దక్కించుకునేందుకు ప్రయత్నం పిండిప్రోలు గ్రామపంచాయతీ వారపు సంత మరొక డేట్ ప్రకటించి మండలంలోని అన్ని గ్రామాల తో పాటు పక్క మండలాలకు జిల్లాలకు పత్రికా ప్రకటన ద్వారా పాంప్లెట్ ల ద్వారా సమాచారం ఇచ్చి సంత వేలం నిర్వహిస్తే ఎక్కువ ధరకు వేలం దక్కుతుందని గ్రామ ప్రజలు అభిప్రాయపడుతున్నారు. గత సంవత్సరం 23 లక్షలు సంత వేలం పలకగా ఈ సంవత్సరం సంత వ్యాపారులు అంత సిండికేట్ గా ఏర్పడి సంతను 14 లక్షలకు అతి తక్కువ ధర కు సంత వేలం దగ్గించుకొని గ్రామపంచాయతీకి నష్టం తెచ్చే విధంగా ప్రయత్నించబోయారు.మండల అభివృద్ధి అధికారులు వెంటనే సంత వేలాన్ని నిలుపుదల చేసి మరలా కొత్తగా సంత బహిరంగ వేలం వేయాల్సిందిగా గ్రామపంచాయతీ ప్రజలు కోరుతున్నారు.

## సిసి రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన

**ముఖ్య అతిథిగా రామ సహాయం నరేష్ రెడ్డి**

తిరుమలాయపాలెం, మార్చి 16, ప్రజా జ్యోతి :



అభివృద్ధి లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని ఇప్పటికే ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు ప్రభుత్వం అమలు చేసిందని, ప్రతి గ్రామంలో ఒక మట్టి రోడ్డు కూడా లేకుండా చేసే ఉద్దేశంతో అభివృద్ధే లక్ష్యంగా తిరుమలాయపాలెం మండలం , జూపెడ గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా విడుదలైన 10 లక్షల వ్యయంతో రెండు సిసి రోడ్ల నిర్మాణాన్ని పాలేరు నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, బీరోలు సొసైటీ డైరెక్టర్ రామ సహాయం నరేష్ రెడ్డి, కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అంటే ప్రజల ప్రభుత్వం అని ఈ ప్రజా పాలనలో ప్రజలే పాలకులని ఇప్పటికే ప్రభుత్వం ప్రజల ముందుంచిన 6 గ్యారంటీలను, ప్రభుత్వం అమలు చేసిందని, రానున్న రోజుల్లో ప్రతి గ్రామంలో మట్టి రోడ్డు అనేది లేకుండా ప్రతి గ్రామాన్ని సిసి రోడ్లు నిర్మించి అభివృద్ధి చేయడమే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యమని వారు అన్నారు. అదేవిధంగా జూపెడ ఎంపీటీసీ లంజపల్లి రజిత, మాట్లాడుతూ... 10 లక్షలు ఎన్ఆర్ఈజీఎస్ నిధుల కింద 10 లక్షలతో జూపెడ గ్రామానికి రెండు సిసి రోడ్లు విడుదలైనందుకు చాలా సంతోషంగా ఉంది, అని అన్నారు ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు లంజపల్లి శ్రీనివాస్, గ్రామ కార్యదర్శి కవిత, నరేందర్ రెడ్డి,శ్రీకాంత్, మట్టే వీరబాబు, మాజీ సర్పంచ్ లంజపల్లి వెంకన్న, ఈడబోయిన నరేష్, సుమన్ రెడ్డి, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల కోడ్‌ను పక్కగా...

(మొదటిపేజీ తరువాయి)

అనుమతులు నిబంధనల ప్రకారం ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్ విధానంలో జారీ చేయాలని ఆయన సూచించారు. ఎన్నికల విధులలో పాల్గొనే ప్రతి ఒక్కరికి తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ అందించే విధంగా వారి సమాచారాన్ని ముందస్తుగా సేకరించాలని, ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది వివరాలు పక్కాగా నమోదు చేయాలని అన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల జారీలో ఎలాంటి ఇబ్బందులు జరగకుండా చూడాలని అన్నారు. ఎన్నికల నేపథ్యంలో అక్రమ నగదు, మద్యం ఇతర ప్రలోభాలకు ఓటర్లు గురికాకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని, జిల్లాలో అవసరమైన మేర చెక్ పోస్టులు ఏర్పాటు చేసి విస్తృతంగా తనిఖీలు నిర్వహించాలని, ఆధారాలు లేకుండా 50 వేలకు మించి నగదు ఎవరు ఎన్నికల దృష్ట్యా తీసుకోని వెళ్ళవద్దని అన్నారు. ఎన్నికల సందర్భంగా నిర్వహించే తనిఖీలలో నగదు జప్తు చేసే సమయంలో ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని, సదరు జప్తు పై ఎక్కడ అప్పీల్ చేయాలో ఆ వివరాలు రశీదులో నమోదు చేయాలని అన్నారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులకు సంబంధించిన ప్రకటనలకు అనుమతి వెంటనే అందించే విధంగా ఎంసిఎంసి పని చేయాలని అన్నారు. శాంతి భద్రతలు కట్టుదిట్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

## కవితక్క అక్రమ అరెస్టు ఖండిస్తూ బిఆర్ఎస్ నేతల నిరసన

చింతకాని. మార్చి 16 ప్రజాజ్యోతి
ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత గారి అక్రమ అరెస్టును ఖండిస్తూ నాగులవంచ గ్రామంలో బి ఆర్ ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ గురజాల హనుమంతరావు గారు మండల పార్టీ కార్యదర్శి బొడ్డు వెంకట రామారావు గారు వంకాయలపాటి లచ్చయ్య గారు నామవరం సర్పంచ్ కొండల రావు గారు తిమ్మినేనిపాలెం ఎక్స్ ఎంపీటీసీ సభ్యులు తెల్ల గొర్ల కృష్ణ గారు గ్రామ శాఖ అధ్యక్షులు ఎస్.కె మదర్ గారు పోటు బ్రిక్షం గారు గంధం సుధాకర్ గారు కందరబోయిన తిరపయ్య గారు ముప్పిడి వెంకటేశ్వర్లు గారు అంబటి వెంకట గారు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## సంఘ విద్రోహ చర్యలకు పాల్పడవద్దు

**పోలీస్ ప్లాగ్ మార్చ్ కవాతులో ఎస్సై గజ్జెల నరేష్**

ముదిగొండ మార్చి 16(ప్రజాజ్యోతి)



ప్రజలెవరు సంఘ విద్రోహ చర్యలకు పాల్పడవద్దని ముదిగొండ ఎస్సై గజ్జెల నరేష్ అన్నారు.ముదిగొండ మండలం లోని సమస్యాత్మక గ్రామాలైన గంధసిరి, కమలాపురం, అయ్యగారిపల్లి గ్రామాల్లో స్థానిక పోలీస్ సిబ్బందితోపాటు,కేంద్ర భద్రతా బలగాలతో శనివారం పోలీస్ ప్లాగ్ మార్చ్ కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఐ జి నరేష్ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు, రాజకీయ నాయకులు తమ ఓటును సక్రమ పద్ధతిలో వినియోగించుకోవాలన్నారు.చట్ట వ్యతిరేక చర్యలకు ఎవరైనా పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.కేసులు వల్ల కుటుంబాలు ఆర్థికంగా దెబ్బతిని చిన్నభిన్నమవుతాయన్నారు. గ్రామాల్లో ఉన్న ప్రశాంతమైన వాతావరణానికి భంగం కలిగించొద్దన్నారు.అరాచకాలు,అలజడలు చేయరాదని ఆయన యువతకు సూచించారు. గ్రామాలను శాంతియుతంగా ఉంచుకోవా లన్నారు. గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగిన,అపరిచితులు సంచరించిన తమకు సమాచారం అందజేసి సహకరించాలని ఎస్సై నరేష్ కోరారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందించిన దేవలా నాయక్

కారేపల్లి, మార్చి 16, ప్రజా జ్యోతి:



అప్పుల బాధతో ఇటీవల ఆత్మ హత్య చేసుకున్న సింగరేణి మండల వెంకట్యాతండా కు చెందిన రైతు గుగులోత్ దేశ్య కుటుంబానికి మాజీ ఎంపీపీ బానోత్ దేవ్లానాయక్, మంగళం కంపెనీ ఎండీ గుగులోత్ రాజేందర్ నాయక్ ఆధ్వర్యంలో రూ. 10వేల ను శనివారం అందజేశారు. రైతు దేశ్యా చిత్రపటానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వాంకుడోత్ కృష్ణ గ్రామ పెద్దలు దేవుసింగ్, మాలోత్ శోభన్, గుగులోత్ శోభన్, గుగులోత్ రమేష్, బానోత్ రవి, గుగులోత్ సుధాకర్, భూక్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## వైరా నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గా గౌసుద్దీన్

కారేపల్లి,మార్చి 16, ప్రజా జ్యోతి :



వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గా ఎస్ కే గౌసిద్దిన్ నియమితులయ్యారు. బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్,మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్లాల్ శనివారం గౌస్ ఉద్దీన్ కు నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా మదన్ లాల్ మాట్లాడుతూ కారేపల్లి,వైరా,కొనిజర్ల,ఏన్కూరు, జూలూరుపాడులో పార్టీ పరంగా జరిగే కార్యక్రమాలు,ఇతరత్రా అంశాలను కోఆర్డినేటర్ ద్వారా తెలియజేస్తామని అన్నారు.గౌసుద్దీన్ నియామకంతో ఐదు మండలాలకు చెందిన బి ఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

## వ్యవసాయ మార్కెట్ లో పనిచేసే కార్మికులకు ఏకరూప దుస్తులను పంపిణీ చేసిన మంత్రి తుమ్మల

ఖమ్మం ప్రతినిధి మార్చి 16 ప్రజా జ్యోతి



వ్యవసాయ మార్కెట్ లో పనిచేసే కార్మికులకు ఏకరూప దుస్తులను రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం పంపిణీ చేశారు. రూ. 55 లక్షల విలువ చేసే ఏకరూప దుస్తులను హమాలీ, దడవాయి, రెల్లాడు, స్వీపర్లు, చాటావాల మొదలగు కార్మిక సంఘాలకు మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రూ. 100 కోట్ల వ్యయంతో ఆధునిక మార్కెట్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా అధికారులకు మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ అధికారులు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ బాధ్యులు, ఎగుమతి, దిగుమతి శాఖల బాధ్యులు, వివిధ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా అమలు చేయాలి : జిల్లా కలెక్టర్ వి పి గౌతం

ఖమ్మం ప్రతినిధి మార్చి 16 ప్రజా జ్యోతి



ఎన్నికల ప్రవర్తనా నియమావళి ని ఖచ్చితంగా అమలుచేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వి.పి. గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. లోకసభ సాధారణ ఎన్నికల షెడ్యూల్ విడుదల నేపథ్యంలో శనివారం ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చినట్లు ఆయన అన్నారు. రాజకీయ పార్టీలు, రాజకీయ పార్టీలకు చెందిన వ్యక్తుల ఫ్లెక్సీలు, బ్యానర్లు, గోడ వ్రాతలు తొలగిస్తున్నట్లు ఆయన తెలిపారు. విగ్రహాలకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు ఉన్నంత వరకు వస్త్రంతో కప్పివుంచడం చేయాలన్నారు. కార్యాలయాలు, ప్రభుత్వ ఆస్తులపై రాజకీయ పక్షాల ఫోటోలు ఉన్న వాటిని తొలగించడం, ప్రభుత్వ వెబ్ సైట్లలో, క్యాలండర్లపై రాజకీయ పక్షాల ఫోటోలు తొలగించడం చేయాలన్నారు.

## పాలిక ఐలయ్య చిత్రపటానికి కాంగ్రెస్ నాయకుల ఘన నివాళి

కారేపల్లి, మార్చి 16, ప్రజాజ్యోతి :

సింగరేణి మండల కేంద్రమైన కారేపల్లి కి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు పాలిక లింగయ్య తండ్రి పాలిక ఐలయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. శనివారం కారేపల్లి లో జరిగిన ఐలయ్య పెద్దకర్మ కు కారేపల్లి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజరై, ఐలయ్య చిత్రపటానికి పూలమాల వేసి, ఘనంగా నివాళు లర్పించారు . కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు తలారి చంద్రప్రకాష్, ఎస్సీ సెల్ నాయకులు మేదరి వీర ప్రతాప్ (టోనీ), సొసైటీ డైరెక్టర్ హీరాలాల్, ఎస్టీ సెల్ నాయకులు వాంకుడోత్ గోపాల్, సీనియర్ నాయకులు సురేందర్ మనియార్, గుగులోత్ భీముడు, జాని, సొట్టు వీరభద్రం, తురక అనిల్, తదితరులు పాల్గొన్నారు.



# హరిజనోద్ధరనుడు, ఆంధ్రా సాధకులు మహనీయుడు పొట్టి శ్రీరాములు

### - కొనియాడిన భాజపా నేత దేవకి వాసుదేవరావు - ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు

ఖమ్మం,మార్చి 16 ప్రజాజ్యోతి



ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు కోసం ఆమరణ నిరాహారదీక్ష చేసి, ప్రాణాలర్పించి, అమరజీవి యైన మహాపురుషుడు పొట్టి శ్రీరాములు అని బిజెపి ఖమ్మం పార్లమెంట్ నేత దేవకి వాసుదేవరావు అన్నారు. దళిత, హరిజనోద్ధరణ కోసం కృషి చేశారని పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు జయంతి పురస్కరించుకొని శనివారం ఖమ్మం పీఎస్ఆర్ రోడ్ లోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద జరిగిన జయంతి వేడుకల్లో దేవకి వాసుదేవరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా బిజెపి ఖమ్మం పార్లమెంట్ నేత దేవకి వాసుదేవరావు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు కొరకు ఆమరణ నిరాహారదీక్ష చేసి, ప్రాణాలర్పించారని కొనియాడారు. మహాపురుషుడు, ఆంధ్రులకు ప్రాంత, భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కారణభూతుడయ్యారని స్మరించుకున్నారు. మహాత్మా గాంధీ బోధించిన సత్యము, అహింస, హరిజనోద్ధరణ అనే ఆశయాల కోసం జీవితాంతం కృషి చేసిన మహనీయుడు అని అన్నారు. ఆస్తిపాస్తులను తల్లికి, అన్నదమ్ములకు పంచిపెట్టి, గాంధీజీ అనుయాయిగా సబర్మతి ఆశ్రమం చేరి . స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారని పేర్కొన్నారు. అనేక ఆశయాల కోసం జీవితాంతం కృషిచేసిన మహనీయుడని కొనియాడారు. జీవితం చివరిదశలో నెల్లూరులో ఉంటూ, హరిజనోద్ధరణకు కృషిచేసాడు. దీనిగురించిన నినాదాలను అట్టలకు రాసి, మెడకు వేలాడేసుకుని ప్రచారం చేసేవాడు. కాళ్ళకు చెప్పులు, తలకు గొడుగు లేకుండా మండుటెండల్లో తిరుగుతూ ప్రచారం చేశాడన్నారు. కులమతాల పట్టింపులు లేకుండా ఎవరి ఇంట్లోనైనా భోజనం చేసేవారని 1946లో నెల్లూరు మూలపేటలోని వేణుగోపాలస్వామి ఆలయంలో హరిజనుల ప్రవేశంకోసం నిరాహారదీక్ష బూని, సాధించాడన్నారు. మరోసారి నిరాహారదీక్ష చేసి, మద్రాసు ప్రభుత్వం చేత హరిజనోద్ధరణ శాసనాలను ఆమోదింపజేసారని , దీని ఫలితంగా వారంలో కనీసం ఒకరోజు హరిజనోద్ధరణకు కృషి చెయ్యవలసిందిగా ప్రభుత్వం కలెక్టర్లకు ఉత్తరువులు ఇచ్చిందన్నారు. కేవలం రాష్ట్ర సాధన కోసం అమరుడైన ఏకైక వ్యక్తి పొట్టి శ్రీరాములు అని దేవకి వాసుదేవరావు స్పష్టం చేశారు. కాలక్రమంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు ఏర్పడ్డాయని, తెలుగు ప్రజల గుండెల్లో పొట్టి శ్రీరాములు చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. ఆయనకు కూడా భారతరత్న ఇవ్వాలనే డిమాండ్లు ఉన్నాయన్నారు. ఈ మహనీయుడిని స్మరించుకునేందుకు అధికార కాంగ్రెస్ నేతలు, ప్రతిపక్ష బి ఆర్ ఎస్ నేతలు రాకపోవడం, కనీసం స్పందించకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ , బి ఆర్ ఎస్ కపట ప్రేమను గమనించాలన్నారు. ఖమ్మం నగరంలో స్థానికంగా జరిగిన పొట్టి శ్రీరాములు జయంతి వేడుకల్లో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# నూతన దంపతులను ఆశీర్వదించిన కాంగ్రెస్ అధ్యక్షులు కాపా సుధాకర్

తల్లాడ, మార్చి 16 (ప్రజా జ్యోతి న్యూస్):



నూతన వధూవరులను ఆశీర్వదించిన తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాపా సుధాకర్ ఆశీర్వదించారు. శనివారం తల్లాడ మండలంలోని ముద్దునూరు గ్రామంలో తెనాలి వెంకటేశ్వర్లు (లేటు) లక్ష్మి దంపతుల ఏకైక కుమారుడు నాగబసవతో కావేరి వివాహం గ్రామంలో జరిగింది. ఈ కార్యక్రమానికి కాపా సుధాకర్ హాజరై నూతన వధూవరులకు అక్షింతలు వేసి దీవించారు. నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో, పిల్లాపాపలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట తల్లాడ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కటికి కిరణ్ కుమార్, ముద్దునూరు గ్రామ యువజన కాంగ్రెస్ నాయకులు భూతం కృష్ణార్జున, జయరాజ్, చారి, రమేష్, కృష్ణయ్య, గుండ్ల వెంకటేశ్వర్లు, లక్ష్మణ్, కాంపాటి కృష్ణ, రవి, జమాల్ ఉన్నారు.

# తాగునీటి సమస్య తీర్చిన మంత్రి తుమ్మల

ఖమ్మం కార్పొరేషన్ మార్చి 16 ప్రజా జ్యోతి :




రఘునాథపాలెం మండలానికి తాగునీటి సమస్యలు తలెత్తడంతో సమస్య తీర్చడం కోసం మండల నాయకులు మంత్రి గారి దృష్టికి గత పది రోజులు క్రితం తీసుకుపోగా ఈ నీటి సమస్యను తీర్చడం కోసం 50 లక్షల రూపాయలు గవర్నమెంట్ నుంచి మంజూరు చేయించిన మన రాష్ట్ర మంత్రి వర్యులు గౌరవ శ్రీ తుమ్మల నాగేశ్వరావు గారికి కృతజ్ఞత గా ఈరోజు ప్రెస్ మీట్ లో తెలియడం జరిగింది. ఈ కార్యక్రమంలో మల్లిడి జగన్,దిరిశల చిన్న వెంకటేశ్వర్లు,దిప్లా నాయక్,దేవ్ సింగ్,రాము నాయిక్,చోటే బాబా, కోటేష్ సతీష్,చిన్న,తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# రేపు రూరల్ మండలంలో పొంగులేటి ప్రసాద్ రెడ్డి పర్యటన

ఖమ్మం,మార్చి 16 ప్రజాజ్యోతి



కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పొంగులేటి ప్రసాద్ రెడ్డి ఖమ్మం రూరల్ మండలంలో ఆదివారం పర్యటించనున్నారు. ఈ మేరకు మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పర్యటనలో భాగంగా మండలంలోని సత్యనారాయణ పురం, రెడ్డి పల్లి, ఎం.వి. పాలెం, కాచిరాజు గూడెం, కస్నాతండా, తనగంపాడు, గూడూరుపాడు, పల్లెగూడెం పోలేపల్లి, తీర్థాల, మంగళ గూడెం, పోలిశెట్టి గూడెం, జాన్ బాద్ తండా , పడమటి తండా, దారేడు, కామంచికల్, రామన్న పేట, దానవాయిగూడెం తదితర గ్రామాల్లో పర్యటిస్తారని తెలిపారు. ఆయా గ్రామాల్లో పలు కుటుంబాలను పరామర్శించి ఓదార్చుస్తారని తెలిపారు. కావున కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరై ప్రసాద్ రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని దయాకర్ రెడ్డి కోరారు.

## పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా నియోజకవర్గంలో ఎస్‌డిఎఫ్‌ఫండ్

# ప్రతి మసీదుకు ఒక లక్ష చొప్పున కేటాయించిన మంత్రి తుమ్మల




**ఖమ్మం ప్రతినిధి మార్చి 16 ప్రజా జ్యోతి**

ఈరోజు పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ఖమ్మం నియోజవర్గంలో ఉన్న మసీదులకు ఒక లక్ష రూపాయలు చొప్పున ఖమ్మం జిల్లా వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తన ఎస్ డి ఎఫ్ ఫండ్ కింద కేటాయించారు. ఈ సంతోష సందర్భంలో గౌరవ మంత్రివర్యులు కు, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క కి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కి, ఖమ్మం నియోజకవర్గ ముస్లిం ప్రజలు పెద్దలు కాంగ్రెస్ నాయకులు మైనార్టీ డిపార్ట్మెంట్ మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేసినారు. ఈ ప్రెస్ మీట్ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నేత చోటా బాబు ఖమ్మం జిల్లా మైనార్టీ చైర్మన్ హుస్సేన్ కాంగ్రెస్ నాయకులు ముస్తఫా ఖాదర్ బాబా ముక్రం ఫరీద్ ఖాద్రి అబ్దుల్ రెహమాన్ సుజా యువ నాయకులు పాల్గొన్నారు. ఈ తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి మంత్రివర్యులు మైనార్టీలకుపెద్దపీట వేయాలని అందరికీ సంక్షేమ పథకాలు అందాలని ముస్లింల అభివృద్ధికి తోడ్పడాలని అల్లా దయవల్ల మీరందరూ బాగుండాలని, ఆ మైనార్టీలు కూడా బాగుండాలని కోరుకుంటున్నాం ముఖ్యంగా తెలంగాణ ప్రభుత్వానికి, మంత్రి తుమ్మల నాగేశ్వరావుకి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాం అని వారు అన్నారు.

# ఉత్సాహపూరిత వాతావరణంలో ప్రారంభమైన ఈయు మహాసభలు

**- హాజరైన 250 మంది ప్రతినిధులు కార్మికుల**

**- సమస్యలపై సుదీర్ఘ చర్చ- ఆంధ్రప్రదేశ్ నుండి హాజరైన సౌహార్ధ ప్రతినిధులు**




**ఖమ్మం మార్చి 16 ప్రజాజ్యోతి**

ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర మూడవ మహాసభలు అత్యంత ఉత్సాహపూరిత -వాతావరణంలో ప్రారంభమయ్యాయి. రాష్ట్ర నలుమూలల నుండి వివిధ డిపోలకు ప్రాతినిధ్యం వహిస్తూ 250 -మంది ప్రతినిధులు ఈ మహాసభకు హాజరయ్యారు. ఖమ్మం టిఎన్జీవోస్ ఫంక్షన్ హాల్లో లో మహాసభల ప్రారంభ సూచికగా ఎంప్లాయిస్ యూనియన్ మాజీ ప్రధాన కార్యదర్శి, సీనియర్ నాయకులు పద్మాకర్, ఎంప్లాయిస్ యూనియన్ పతాకాన్ని ఆవిష్కరించారు. వందలాది మంది కార్మికులు ఎంప్లాయిస్ యూనియన్ వర్ధిల్లాలి, -ఏఐటీయుసి జిందాబాద్ అనే నినాదాలతో సభ ప్రాంగణం హోరెత్తింది. సుదీర్ఘ కాలం కార్మిక హక్కుల కోసం ఆర్టీసీ -మనుగడ కోసం సుదీర్ఘ కాలం పోరాటాలు నిర్వహించి అసువులు బాసిన అమర వీరులకు మహాసభ నివాళులర్పించింది. మహాసభల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అమర వీరుల స్మారక స్థూపానికి పూలమాలలు వేసి -ఎంప్లాయిస్ యూనియన్ సీనియర్ నాయకులు తిమ్మినేని రామారావు నివాళులర్పించగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు, వివిఎస్ బోస్, పోటు ప్రసాద్, పద్మాకర్, ఎస్. బాబు, వెంకట్ గౌడ్, నర్సింహాన్, పెద్ద సంఖ్యలో మహిళా కార్మికులు, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు అమరులకు -నివాళులర్పించారు. మహాసభ ప్రారంభం కాగానే గత మహాసభ నుండి ఈ మహాసభ వరకు మరణించిన వారికి -సంతాప సూచికగా సభ రెండు నిమిషాలు మౌనం పాటించింది. ఆహ్వాన సంఘం పక్షాన ఆహ్వాన సంఘ ప్రధాన కార్యదర్శి కె. భాస్కర్ ఆహ్వాన సంఘ స్వాగతోపన్యాసం చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈ. వెంకన్న అతిథులను, ఆహ్వానితులను, సంఘ బాధ్యులను వేదికపైకి ఆహ్వానించారు. మహిళా కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ -మహాసభలలో తెలంగాణలోని ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలకు సంబంధించి విస్తృత స్థాయిలో చర్చించారు. ముఖ్యంగా ప్రభుత్వం 21 శాతం ఫిట్మెంట్ ఇవ్వడం పై ప్రతినిధులు ప్రభుత్వ వైఖరిని తప్పుబట్టారు. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరి 30 శాతం ఫిట్మెంట్ ఇవ్వాల్సిందేనని మహాసభ పక్షాన ఏకగ్రీవంగా తీర్మానించారు. అలాగే పెండింగ్లో ఉన్న తొమ్మిది డిఏలను తక్షణం విడుదల చేయాలని మహాసభలో ప్రవేశపెట్టిన తీర్మానాన్ని -మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించే ప్రక్రియను -వేగవంతంగా పూర్తి చేయాలని అపాయింట్మెంట్ డేట్ను ప్రకటించాలని మహాసభలో తీర్మానించారు. పెరిగినప్రయాణికులకు అనుగుణంగా బస్సుల సంఖ్యను, సిబ్బందిని పెంచాలని తక్షణం ఆర్టీసీలో అన్ని విభాగాలకు -సంబంధించి నియమకాలు చేపట్టాలని మహాసభ డిమాండ్ చేసింది. మహిళా కార్మికులకు ప్రత్యేక సెలవులతో -పాటు సౌకర్యాలు, విధి నిర్వహణలో సౌలభ్యం కల్పించాలని మహాసభలో ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఏకగ్రీవంగా -ఆమోదించారు. మహాసభ ఆదివారం కూడా జరగనుంది. తెలంగాణ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ -మహాసభలకు ఆంధ్రప్రదేశ్ నుంచి సౌహార్థ సందేశాన్ని ఇచ్చేందుకు అక్కడి సంఘ బాధ్యులు దామోదర్, నర్సయ్య -లు హాజరయ్యారు.

# అమరజీవి పొట్టి శ్రీరాములుకి భారతరత్న ఇవ్వాలి

**ఖమ్మం నగర ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గోళ్ల రాధాకృష్ణమూర్తి**



**ఖమ్మం కార్పొరేషన్ మార్చి 16 ప్రజా జ్యోతి :** అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా ఖమ్మం నగర ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గోళ్ల రాధాకృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఆ మహనీయుని విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళి అర్పించడం జరిగింది .ఈ కార్యక్రమానికి అతిథిగా శ్రీ దేవకి వాసుదేవరావు విచ్చేశారు . ఈ సందర్భంగా వ్యక్తులు మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగనిరతిని ఈ నాటి సమాజం గుర్తుంచుకోవాలని , అలాగే వారికి భారతరత్న ప్రకటించాలని ఖమ్మం నగర ఆర్యవైశ్య సంఘం తరపున డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వెంపటి సత్యనారాయణ , గుమ్మడవెల్లి శ్రీనివాస్ , మాసెట్టి వరప్రసాద్, బూర్లె పుల్లారావు , గుంటుపల్లి దివాకర్ గుప్తా , నకిరికంటి సతీష్, రాయపూడి రవికుమార్, రాయపూడి జయరాం , యడమకంటి రామారావు , ఎర్రం రామకృష్ణ, కొంకిమళ్ళ మృత్యుంజయరావు, తూములూరు లక్ష్మీ నరసింహారావు , పెనుగొండ శ్రీనివాసరావు, కోదుమూరు శ్రీనివాసరావు, కొదుమూరు జగన్నాథం , కొత్తూరు రమేష్ , సోమశేషగిరి రావు, కల్వకుంట్ల హనుమంతరావు , అవోపా కృష్ణమూర్తి , యెచ్చ రామకృష్ణ ,తదితరులు పాల్గొన్నారు.

# కవిత అరెస్టుకు బిఆర్ఎస్ నిరసన



**ముదిగొండ మార్చి 16(ప్రజా జ్యోతి)**

భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) పార్టీ ఎమ్మెల్సీ కవిత అరెస్టును ఖండిస్తూ బిఆర్ఎస్ ముదిగొండ మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం ముదిగొండలో నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా కేంద్ర ప్రభుత్వం విధానాలను నశించాలి,ప్రధాని మోడీ,డౌన్,డౌన్ అంటూ కార్యకర్తలు నినాదాలు చేశారు. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షకార్యదర్శి వాచేపల్లి లక్ష్మారెడ్డి,గడ్డం వెంకట్ గౌడ్,నాయకులు పోట్ల ప్రసాద్, పాము సిల్వారాజు బంక మల్లయ్య,కోటి అనంతరాములు, ఓబినబోయిన అమరయ్య,తోట ధర్మారావు, చెరుకుపల్లి బిక్షం,అమరబోయిన వీరబాబు,మోర పాపారావు తదితరులు పాల్గొన్నారు.

# కవితక్క అక్రమ అరెస్టును ఖండిస్తూ బిఆర్ఎస్ నేతల నిరసన



**కల్లూరు మార్చి 16(ప్రజాజ్యోతి):**

బిఆర్ఎస్ నాయకురాలు,ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితని ఈడి అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ మాజీ శాసన సభ్యులు సండ్ర వెంకటవీరయ్య నాయకత్వంలో బిఆర్ఎస్ కల్లూరు మండల పార్టీ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు నల్ల బ్యాడ్జీలు ధరించి,నల్ల జెండాలు చేతబూని నిరసన తెలియజేశారు.రాజకీయాల్లో కక్ష సాధింపు ద్వారణి సరైంది కాదని తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు,మాజీ ప్రజా ప్రతినిధులు,ముఖ్య నాయకులు,కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్ వితరణ

**ముదిగొండ మార్చి 16(ప్రజా జ్యోతి)**

మండలపరిధిలో బాణాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న 10వ తరగతి విద్యార్థిని, విద్యార్థులకు తమ్మారపు వేణు జ్ఞాపకార్థం ఆపాఠశాలలో 2005-6 సంవత్సరంలో విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థులు పరీక్ష ప్యాడ్స్ శనివారం వితరణగా అందజేశారు. ఈసందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇవి రామిరెడ్డి మాట్లాడుతూ ఈనెల 18 నుండి ప్రారంభమయ్యే 10వ తరగతి కామన్ పరీక్షలను విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి లేకుండా రాయాలన్నారు. ఈకార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయని, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

